సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 24 । మార్చి । 2023

గరిష్టం / కనిష్టం
34°/ 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉంటుంది.

ప్రజల కోసం.. ప్రజలే 'సాక్షి'గా

- జనం ఎదుర్కొంటున్న సమస్యలే అక్షరాయుధాలు
- ఆపన్నులకు అండగా.. వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..
- 'సాక్షి' కథనాలతో తొలగిన ఇబ్బందులెన్నో...
- ఊర్లకు బస్సులు.. వాగులు దాటేందుకు బ్రిడ్జిలు కూడా..

జనం ఎదుర్కొంటున్న సమస్యలే అక్షరాయుధాలుగా.. ప్రతీ అక్షరం ప్రజాప్రతినిధులు, అధికారులు మేల్కొనేలా ఇస్తూ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తూ తపించిన 'సాక్షి' పదహారో వసంతంలోకి అడుగిడుతోంది. ఈ ప్రయాణంలో ప్రజల సమస్యల పరిష్కారం, వారికి సౌకర్యాలు కల్పించేలా తపిస్తూ ఇచ్చిన ఎన్నో కథనాలు యంత్రాంగాన్ని మేల్కొలిపాయి. ఈ కథనాలతోనే ఒక ఊరికి కరెంట్ రాగా.. ఇంకో ఊరికి రవాణా సౌకర్యం మెరుగుపడింది. మరో ఊరి ప్రజల కోసం బస్సు మొదలైంది. ఆపదలో ఉన్న వారికి అండ దక్కింది.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజల కోసం 'సాక్షి' తన వంతుగా చేసిన ప్రతీ ప్రయత్నం విజయవంతమైంది. శుక్రవారం 'సాక్షి' పదహారో వసంతలోకి ప్రవేశిస్తున్న నేపథ్యాన పదిహేనేళ్ల ప్రయాణంలో సాధించిన విజయాల్లో కొన్ని మీ కోసం... – సాక్షి నెట్‌వర్క్

రూ.8.90 కోట్ల కుంభకోణం వెలుగులోకి..



అక్రమ రుణాల అంశంపై ప్రచురించిన కథనం

నకిలీ పాస్‌పుస్తకాలతో రుణాలు తీసుకున్న విషయాన్ని 'సాక్షి' బయటపెట్టగా.. 37మంది నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురిపై పీడీ యాక్ట్ కూడా నమోదైంది. తద్వారా ప్రజాధనం అక్రమార్కుల పాలు కాకుండా అధికారులు చర్యలు తీసుకోగలిగారు. వివిధ బ్యాంకుల్లో పలువురు నకిలీ పాస్ పుస్తకాలు సమర్పించి రుణాలు తీసుకున్న విషయం అధికారుల తనిఖీల్లో బయటపడగా 27 జూలై 2017న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఆతర్వాత సత్తుపల్లి మొదలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం ముష్టిబండ, వెంకటాద్రిగూడెం, అప్పారావుపేట గ్రామాలలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన అన్ని ఆధారాలతో బయటపెట్టిన కథనాలు సంచలనం కలిగించాయి. తొలుత ఐటీబీకే పరిమితమైందనుకున్న రుణాల కుంభకోణం మరికొన్ని బ్యాంకుల్లో జరిగినట్లు వెల్లడైంది. ఈ అంశంపై 2017 జూలై 28న నకిలీ మకిలీ, 29న ముష్టిబండ.. నకిలీకి అడ్డా, ఆగస్టు 1న నకిలీపై నజర్.. అంతా జీ హుజూర్, ఆగస్టు 2న రంగంలోకి ప్రత్యేక బృందాలు, 3న ఇప్పటి వరకు తేలిన నకిలీ లెక్క 753..., 8వ తేదీన రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, 9 నాగుపల్లి.. 'నకిలీ'లొల్లి.. నకిలీ విచారణ వివాదాస్పదం, 15న లోనుగుట్టు ఎరుకే ఇలా వరుస కథనాలతో నకిలీ పాస్‌పుస్తకాల కుంభకోణంలోని అన్ని అంశాలను బయటకు తీయడంతో 731 మంది నకిలీ పాస్‌పుస్తకాలతో రూ.8.93 కోట్లు రుణాలు పొందినట్లు నిర్ధారణ అయింది. ఇందులో 37 మంది నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపగా, వీరిలో ముగ్గురిపై పీడీ యాక్ట్ నమోదైంది. ఇక రెండు బ్యాంకుల మేనేజర్లు సస్పెండ్ కాగా, మరో బ్యాంకు మేనేజర్‌ను విధుల నుంచి తొలగించారు.

ఈ దారి.. రహదారి!

ఖమ్మం–అశ్వారావుపేట జాతీయ రహదారి గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిన నేపథ్యాన 'సాక్షి' ఆధ్వర్యాన రహదారిని పరిశీలించి 2020 సెప్టెంబర్ 4న 'దారిద్ర్యం!' శీర్షికన సమస్యలతో కూడిన ఫొటోలతో కథనాన్ని ప్రచురించింది. జాతీయ రహదారి 365 బీబీగా మారిన తర్వాత అటు ఆర్‌అండ్‌బీ, ఇటు జాతీయ రహదారుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లుగా ప్రస్తావించగా.. సత్తుపల్లి ఎమ్మెల్యే 'సాక్షి' కథనాన్ని చూపిస్తూ అదేనెల 16న అసెంబ్లీలో మాట్లాడారు. అయినా కదలిక రాకపోవడంతో 'ప్రతిపాదనలతోనే సరి' శీర్షికన నవంబర్ 3న మరో కథనం ఇవ్వడంతో నేషనల్ హైవేస్ అధికారులు తక్షణమే సమీక్ష జరిపి రూ.60కోట్లు మంజూరు చేశారు. ఆతర్వాత పనుల్లో వేగం లేకపోవడంతో 25 జనవరి 2021న 'అగమ్యగోచరం' శీర్షికన కథనం రావడంతో అధికారులు మేల్కొని ఖమ్మం–అశ్వారావుపేట జాతీయ రహదారిని తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ రహదారిపై రాకపోకలు సులువుగా, సాఫీగా సాగుతున్నాయి.



రహదారిపై దుస్థితిపై ప్రచురితమైన కథనం


ప్రస్తుతం రహదారి మిట్టపల్లి - కల్లూరు రహదారి

'వారధి'తో తొలగిన ఇక్కట్లు

గుండాల మండలంలోని మోదుగులగూడెం – నడిమిగూడెం మధ్య కిన్నెరసాని నది దాటేందుకు గిరిజనులు పడిన ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. మామూలు సమయాల్లో ఎలాగోలా దాటినా, వర్షాకాలంలో అష్టకష్టాలు పడేవారు. నది మధ్య బండరాళ్లపై చెక్కలు వేసుకుని గిరిజనులు దాటుతున్న అంశంపై 2021 జూలై 13న 'ఈ సాహసం ప్రమాదకరమైనది' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అప్పటి సీఐ శ్రీనివాస్,ముత్యం రమేష్ ఆధ్వర్యాన మరుసటి రోజే ఇనుప పైపులు, రేకులతో తాత్కాలిక వంతెన ఏర్పాటుచేయించారు. అనంతరం పక్కా బ్రిడ్జి నిర్మించడంతో గిరిజనుల ఇక్కట్లు శాశ్వతంగా తీరిపోయాయి.


నది దాటేందుకు గిరిజనుల కష్టాలు


ఇదే ప్రాంతంలో నిర్మించిన బ్రిడ్జి

గుండాల వెళ్లాలంటే నరకం కనిపించేది..



ఎండాకాలం మినహా వర్షాకాలం గుండాల వెళ్లాలంటే పడరాని పాట్లు పడాల్సిందే. మా ఊరి వాగు పక్కన ఉన్న మోదుగులగూడెం, ముత్తాపురం, తూరుబాక గ్రామాలకు చెందిన రైతులు చేను పనులకు వాగు దాటాల్సిందే. గతంలో వాగు కారణంగా ఇబ్బందులు వచ్చేవి. 'సాక్షి' కథనంతో పోలీసులు ఇనుప షీట్లతో బ్రిడ్జి వేయగా.. ఆతర్వాత నూతన బ్రిడ్జి నిర్మించారు.
– తాటి రమేష్, నడిమిగూడెం





అక్రమార్కులకు అడ్డుకట్ట

ఖమ్మం నగరాన్ని ఆనుకుని ఉన్న మున్నేరు నది బఫర్ జోన్ ఆక్రమణకు గురవుతోందంటూ 7 మే 2022న 'బఫర్‌జోన్ హాంఫట్' శీర్షికన కథనం ప్రచురితమైంది. బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రస్తావించాం. తొలుత రేకులషెడ్లు వేసి.. ఆ తర్వాత పక్కా భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్పొరేషన్ కమిషనర్ మే 9న ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు వారు పరిశీలించి మున్నేరు బఫర్ జోన్‌లో అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలను జూన్ 16వ తేదీన తొలగించారు.

ఉత్తుత్తి ఉద్యోగాలు

ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులే లక్ష్యంగా దళారులు వల విసిరారు. అటవీశాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని కొందరు నిరుద్యోగుల వద్ద డబ్బు వసూలు చేయడమే కాకుండా.. అటవీశాఖ లెటర్‌హెడ్‌తో సంతకాలు, స్టాంపులతో కూడిన ఉత్తర్వులు ఇచ్చేశారు. దీంతో అభ్యర్థులు నిజంగానే తమకు ఉద్యోగం వచ్చిందని.. అటవీశాఖ కార్యాలయానికి వెళ్లగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని అధికారులు పేర్కొనడంతో అవాక్కవడం అభ్యర్థుల వంతయింది. ఈ తంతుపై సెప్టెంబర్ 28న 'మీకు ఉద్యోగం వచ్చింది' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి విచారణకు టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటుచేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమార్కుల గుట్టురట్టయింది.



'సాక్షి' ఆబ్సల్యూట్లీ కరెక్ట్!

– ప్రశంసించిన మంత్రి పువ్వాడ



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పలు సమస్యలు, ఆక్రమణలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించడంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రశంసించారు. గత ఏడాది మే 27న ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో 'పట్టణ ప్రగతి'పై సమీక్షించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. ''ఈ మధ్య కాలంలో 'సాక్షి'లో.. 'మున్సిపాలిటీలో పర్యవేక్షణ కరువైంది అనే వార్త వచ్చింది. ఇది ఆబ్సల్యూట్లీ రైట్' అని మంత్రి ప్రజాప్రతినిధులు, అధికారులతో చెప్పడం 'సాక్షి' నిబద్ధతను చాటిచెప్పింది.

బాధిత రైతులకు భరోసా


రావినూతలలో మొక్కజొన్న పంట నష్టపోయిన రైతు రామకృష్ణతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రులు పువ్వాడ అజయ్, సింగిరెడ్డి, సీఎస్ శాంతికుమారి

బోనకల్ మండలంలో పంట నష్టాన్ని పరిశీలించిన కేసీఆర్

- హెలీప్యాడ్ వద్ద ఫొటో ఎగ్జిబిషన్
- ఒక్కో రైతుతో మాట్లాడి నష్టం వివరాలపై ఆరా
- ప్రభుత్వం అండగా ఉంటుంది.. ఆదుకుంటుందని హామీ
- తక్షణమే సహాయ పునరావాస చర్యగా నిధుల మంజూరు ప్రకటన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఇటీవలి అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు భరోసానిచ్చేలా సాగింది. అకాల వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 31,038 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. 19,732 మంది రైతులు నష్టపోయారు. పంట నష్టంలో 30వేలకు పైచిలుకు ఎకరాలు మొక్కజొన్నే ఉంది. దీంతో ముఖ్యమంత్రి గురువారం జిల్లాలోని బోనకల్ మండలం రావినూతల, గార్లపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను స్వయంగా పరిశీలించి.. రైతులతో మాట్లాడి సాగుకు అయిన ఖర్చు, నష్టం, ఇతర ఇబ్బందులపై ఆరా తీయడంతోపాటు ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. బోనకల్ మండలంతోపాటు జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలకు తక్షణ సహాయంగా ఎకరానికి రూ.10వేల చొప్పున రూ.228 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

గంటపాటు సీఎం పర్యటన..

జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన గంటపాటు సాగింది. జిల్లావ్యాప్తంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి హెలీప్యాడ్ వద్ద వ్యవసాయ శాఖ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా.. ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు పరిశీంచారు. అనంతరం రావినూతలలో 35 ఎకరాల్లో మొక్కజొన్న నష్టపోయిన రైతుతో మాట్లాడారు. కంకిని స్వయంగా పరిశీలించి నష్టంపై రైతును ఆరా తీశారు. అలాగే గార్లపాడులో కూడా మొక్కజొన్నను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని అభయమిచ్చారు.

సీఎస్, కలెక్టర్‌కు ఆదేశాలిస్తాం..

జిల్లాతోపాటు మధిర నియోజకవర్గంలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యేలు, నేతలు తన దృష్టికి తెచ్చారని ముఖ్యమంత్రి విలేకరుల సమావేశంలో ప్రస్తావించారు. ఈ మేరకు కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని, ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చెప్పి.. జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ఆదేశాలు ఇప్పిస్తామని ప్రకటించారు. సేద్యం చేసి నష్టపోయిన రైతులతోపాటు కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

కేసీఆర్ వెంట వెళ్లిన తుమ్మల

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం పర్యటనకు హాజరయ్యారు. రెండు హెలీకాప్టర్లతో సీఎం కార్యాలయ అధికారులు, ముఖ్యమంత్రి పంటల పరిశీలనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్ జిల్లాకు వెళ్తుండగా, ముఖ్యమంత్రి కేసీఆర్.. తుమ్మలను కూడా హెలీకాప్టర్‌లో తీసుకెళ్లారు. జిల్లాల పర్యటన ముగిశాక హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తుమ్మల భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టుపై చర్చించగా సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను పిలిపించి వివరాలు ఆరా తీసిన సీఎం కేసీఆర్... ఎన్నికల సమయానికి సీతారామ ద్వారా రైతులకు నీరు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తనతో చెప్పారని తుమ్మల తెలిపారు.

సీఎం పర్యటనలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్, సీఎంఓ అధికారి రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, నవీన్ మిట్టల్, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎంపీలు సంతోష్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, రాములునాయక్, మెచ్చా నాగేశ్వరరావు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, అదనపు కలెక్టర్లు మధుసూదన్, స్నేహలత, మాజీ ఎమ్మెల్యేలు బానోతు చంద్రావతి, మదనలాల్, ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

బోనకల్ మండలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం వ్యక్తిగత భద్రతా సిబ్బందితోపాటు జిల్లా పోలీసులు బుధవారం రాత్రే రావినూతల, గార్లపాడు గ్రామాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈసందర్భంగా భద్రతా సిబ్బందితో పాటు డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు అణువణువూ క్షుణ్ణంగా పరిశీలించాయి. భద్రతా ఏర్పాట్లను డీజీపీ అంజనీకుమార్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్, సీపీ విష్ణు ఎస్.వారియర్ పర్యవేక్షించగా, 300 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

పరిస్థితి ఎలా ఉంది?


మధిర/బోనకల్/చింతకాని: బోనకల్ మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలనకు వచ్చిన సీఎం కేసీఆర్ మొక్కజొన్న పంటను పరిశీలించడమే కాక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని రావినూతలలో 35 ఎకరాల మేర మొక్కజొన్న నష్టపోయిన కౌలు రైతు రామకృష్ణ, గార్లపాడులో కౌలు రైతులు కొంచర్ల కృష్ణ, మందా హనుమంతరావుతో మాట్లాడారు.

- **సీఎం కేసీఆర్ :** ఎన్ని ఎకరాల్లో సాగు చేశావు?
- **కౌలు రైతు కృష్ణ :** 18 ఎకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగుచేశా.
- **సీఎం :** అసలు రైతులు ఎక్కడ ఉంటారు?
- **కృష్ణ :** కొందరు సిటీలో, మరికొందరు ఇతర ఊర్లలో ఉంటున్నారు. వారు వ్యవసాయం చేయకుండా మాకు కౌలుకు ఇస్తుంటారు.
- **సీఎం :** కౌలు ముందు కట్టారా?
- **కృష్ణ :** అవును. ముందే మొత్తం డబ్బు చెల్లించాం.
- **సీఎం :** పెట్టుబడి ఎంత అయింది?
- **కృష్ణ :** ఎకరానికి రూ.20 వేల కౌలు, రూ.30 వేల పెట్టుబడితో కలిపి రూ.50 వేలు చొప్పున రూ.9 లక్షలు ఖర్చు అయింది. మమ్మల్ని మీరే ఆదుకోవాలి.
- **సీఎం :** కేసీఆర్ తప్పకుండా ఆదుకుంటాం. ఆందోళన చెందొద్దు.

- **సీఎం కేసీఆర్ :** ఎన్ని ఎకరాల్లో సాగు చేశావు?
- **కౌలు రైతు హనుమంతురావు :** 11 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేశాను.
- **సీఎం :** కౌలు ఎంత, పెట్టుబడి ఎంత?
- **హనుమంతరావు :** ఎకరానికి రూ.30 వేల కౌలు, రూ.25 వేల పెట్టుబడితో కలిపి మొత్తం రూ.55 వేలు ఖర్చు అయింది.
- **సీఎం :** కంకి తయారీ దశలో ఉన్న పంట పరిస్థితి ఏంది?
- **హనుమంతరావు :** మీరే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.
- **సీఎం :** అందరినీ ఆదుకుంటాం.. పరిహారం చెల్లిస్తాం.


ఐజీ చంద్రశేఖర్, సీపీ వారియర్‌తో భద్రత ఏర్పాట్లపై చర్చిస్తున్న డీజీపీ అంజనీకుమార్


హెలీప్యాడ్ వద్ద ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న సీఎం, చిత్రంలో మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్



మణుగూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సెక్రటేరియట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనను మణుగూరుకు పూర్తిస్థాయి కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పని చేస్తున్న మురళీకృష్ణను మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఉమామహేశ్వరరావు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

పారదర్శకంగా క్రమబద్ధీకరణ

- కటాఫ్ డేట్ 2020 జూన్ 2
- ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ప్రభుత్వానికి అప్పగించిన భూముల్లో నివాసాలు, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరణ పట్టాలు జారీ చేసేందుకు 2020 జూన్ 2 కటాఫ్ డేట్‌గా మరో అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. ఐడీఓసీలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. 2019, 2022 సంవత్సరాల్లో జీఓ 79 ప్రకారం ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందని ఎమ్మెల్యే వనమా తెలిపారు. నాడు కటాఫ్ డేట్ 2014 జూన్ 2 వరకు ఉండగా, తాము పలుమార్లు సీఎం కేసీఆర్‌కు చేసిన విజ్ఞప్తి మేరకు 2020 వరకు పెంచారని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని, ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని స్పష్టం చేశారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జీఓ 76 ప్రకారం రెండు విడతలలో కొత్తగూడెంలో 8,585, ఇల్లెందులో 4,666, చుంచుపల్లిలో 3, లక్ష్మీదేవిపల్లిలో 2, దమ్మపేటలో ఒక దరఖాస్తు కలిపి మొత్తం 13,257 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. విచారణ అనంతరం కొత్తగూడెంలో 5,336, ఇల్లెందులో 2,507 మొత్తం 7,843 మందిని అర్హులుగా ఎంపిక చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ స్వర్ణలత, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, తహసీల్దార్లు నవీన్‌కుమార్ శర్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

గోదావరి ఉన్నా నీరందించలేకపోతున్నాం..

చెంతనే గోదావరి నది ఉన్నా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోతున్నామని, ఇందుకోసం తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో గురువారం మిషన్ భగీరథ, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనులతో మంచినీటి పైపులు పాడవుతున్నాయని, వాటి మరమ్మతులకు ఆయా శాఖల నుంచి రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బోర్ల వినియోగంతో భూగర్భ జలాలను తోడేస్తున్నందున ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తోందని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. లీకేజీలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు తిరుమలేష్, నళిని, డీపీఓ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన ఎమ్మెల్యే వనమా. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరుటౌన్: కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న తెలిపారు. గురువారం ఆయన కోల్ క్లీనింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు అరటిపండ్లు, బెల్లం పంపిణీ చేశారు. బొగ్గు దుమ్ములో పనిచేసే ప్రతి కార్మికుడికి వారానికి ఒకసారి బెల్లం, అరటి పండ్లు పంపిణీ చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ కోల్ క్లీనింగ్‌కు చిన్న ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బొగ్గు, దుమ్ము ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మనుషులు పనిచేయకుండా యంత్రాలను ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ సూర్యనారాయణ, డీఈ రాంమోహన్, ఏడీఈ వలి, ఏఈ రజావుల్లా, సేఫ్టీ డీఈ ఆనంద్ ప్రసాద్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో జాతీయ నాణ్యతా బృందం తనిఖీ

టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీని జాతీయ నాణ్యతా ప్రమాణాల భరోసా బృందం గురువారం సందర్శించింది. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, నియమ నిబంధనలు జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించిన బృందం సభ్యులు.. అన్ని రకాల రికార్డులు, వార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు సునీల్ శర్మ, సంగీత, బాలాజీనాయక్, మణికంఠా రెడ్డి, చైతన్య, సుందర్, సాగర్, వేదమణి, సునీత, సాజిదాబేగం, సత్యవతి, గన్యానాయక్, స్థానిక వైద్యుడు కందుల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణి స్టోర్స్‌లో తనిఖీ


అధికారులతో మాట్లాడుతున్న జీఎం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా స్టోర్స్‌ను గురువారం జీఎం(స్టోర్స్) పి. చిన్న బసివిరెడ్డి, సెక్యూరిటీ విభాగం అధికారులు శశిధర్ రాజు, బి.హనుమంతరావులు తనిఖీ చేశారు. ఇటీవల జరిగిన చోరీ వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. సింగరేణి అధికారులు షాలేము రాజు, ఎం. మల్లయ్య, శేఖర్‌బాబు,జీవీ మోహన్‌రావు, కిష్టఫర్, జి. ఆనంద్‌రావు, చిన్నయ్య, బాలాజీ నాయుడు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్: శ్రీ దేవీ వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం పెద్దమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా 108 సువర్ణపుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆలయ ఈఓ రజనీకుమారి, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఆస్థాన పురోహితుడిని నియమించాలి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆస్థాన పురోహితుడిని నియమించాలని భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు రామవజ్ఝల రవికుమార్ శర్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలయంలో ఆస్థాన పురోహితులుగా పనిచేసిన వెంకటేశ్వర అవధాని పదవీ విరమణ చేసి 9 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు మరొకరిని నియమించలేదని తెలిపారు. వైదిక కార్యక్రమాల్లో ఆస్థాన పురోహితుడి ప్రాధాన్యం దృష్ట్యా వెంటనే నియమించాలని కోరారు.

భారీ వర్షంతో మిర్చి రైతులకు నష్టం


మిర్చి రాశులను కమ్మేసిన ఇసుక

చర్ల: ఇప్పటికే నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోగా గురువారం సాయంత్రం మళ్లీ భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి కాయలను కాపాడుకోలేకపోయారు. వర్షం, గాలిదుమారానికి కొన్ని కల్లాల్లో ఆరబోసిన మిర్చిని ఇసుక కమ్మేయగా, మరికొన్ని గ్రామాల్లో చెల్లాచెదురయ్యాయి. కొత్తపల్లి, లింగాపురం, చింతకుంట, జీపీపల్లి, వీరాపురం, మొగళ్లపల్లి, తేగడ, కుదునూరు, ఆర్.కొత్తగూడెంల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం సందర్శన

భద్రాచలంటౌన్: భద్రాచలం డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం సభ్యులు గురువారం సందర్శించారు. కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ శిరీష కులకర్ణి, కో ఆర్డినేటర్ డాక్టర్ మువ్వా విజయలక్ష్మి కళాశాల పనితీరు, రికార్డులు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలను అభివృద్ధి చేయాలని కోరుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఇల్లెందు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాఘబోయినగూడెం పంచాయతీ జింకల తండాలో గురువారం చోటు చేసుకుంది. తండాకు చెందిన బి.భీమా(28) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవటంతో విసుగు చెందిన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భీమాకు భార్య అమ్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ బి. రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రామాలయంలో షార్ట్ సర్క్యూట్

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి స్వల్పంగా మంటలు లేచాయి. ఆలయం లోపల టికెట్ల కౌంటర్ పైభాగంలో ఉన్న విద్యుత్ ప్యానల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలతో పొగలు కమ్ముకున్నాయి. గమనించిన ఎస్‌టీఎఫ్, దేవస్థానం సిబ్బంది అగ్నిమాపక నివారణ సిలిండర్లతో మంటలను ఆర్పారు. అనంతరం అగ్నిమాపక శాఖ సిబ్బంది సైతం వచ్చి నివారణ చర్యలు చేపట్టారు. రాత్రి సమయం కావడంతో భక్తులు తక్కువ మంది ఉండటం, గమనించి సిబ్బంది అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది.


పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

నైతికత.. ఆరోగ్యం

- ఉపవాస దీక్షలతో ఎన్నో ప్రయోజనాలు
- నేటి నుంచి పవిత్ర రంజాన్ మాసం
- 'రోజా' పాటించేందుకు సిద్ధమైన ముస్లింలు


మక్కా (ఫైల్)

చండ్రుగొండ/ఇల్లెందురూరల్: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం వచ్చేసింది. గురువారం సాయంత్రం నెలవంక కనిపించడంతో శుక్రవారం నుంచి ఉపవాస(రోజా) దీక్షలు ప్రారంభించనున్నారు. దివ్యఖురాన్ ఈ మాసంలోనే అవతరించిందని ముస్లింలు విశ్వసిస్తారు. ఈ మాసంలో వేకువజామున సహర్ భుజించిన అనంతరం సూర్యాస్తమయం వరకు నిష్టగా, చిత్తశుద్ధితో ఉపవాసం(రోజా) పాటిస్తే పాపాలు తొలగిపోతాయని మహ్మద్ ప్రవక్త చెప్పినట్లు ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొంటున్నారు. నిరుపేదల ఆకలిబాధలు గ్రహించగలుగుతారని చెబుతున్నారు. సాధారణ రోజుల్లో ముస్లింలు రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తారు. రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్న వారు రాత్రింబవళ్లు నమాజ్‌లో లీనమై ఉండటంతో భక్తి, ఆధ్యాత్మికత పెంపొందుతుంది.

రోజాతో పలు ప్రయోజనాలు

ఉపవాసంతో మానసిక, శారీరక, నైతిక, సామాజిక ప్రయోజనాలు కలుగుతాయి. సూర్యోదయం కంటే ముందు నుంచి సూర్యాస్తమయం వరకు దాదాపు 13 నుంచి 14 గంటలపాటు ఉపవాసం ఉండటం వల్ల మానసిక నియంత్రణతో చెడు నుంచి దూరంగా ఉండగలుగుతారు. పగటి వేళ ఆహార పానీయాలు తీసుకోకపోవడంతో జీర్ణకోశం బలోపేతం అవుతుంది. ఉదరకోశానికి విశ్రాంతి నివ్వడం ద్వార శరీరానికి అనారోగ్యం కల్గించే ఆమ్లాలు హరించుకుపోతాయి. జీర్ణశక్తి, రోగనిరోధక శక్తి పెరుగుతాయి. ఇదే విషయాన్ని ఆయుర్వేదశాస్త్రం కూడా బలపరుస్తుంది. తనను తాను అదుపులో ఉంచుకుని రంజాన్ ఉపవాసాలు నైతికతను పెంపొందిస్తాయి. ఈ నెల రాబోవు 11 నెలలకు శిక్షణ లాంటిది. ఆకలిదప్పుల బాధ తెలిసి దయాగుణం అలవడుతుంది. రంజాన్ నెలలో రూపాయి దానం చేస్తే అందుకు ఏడు వందల రెట్లు పుణ్యఫలం దక్కుతుందని మహ్మద్ ప్రవక్త చెప్పినట్లు మత పెద్దలు చెబుతున్నారు. ప్రతి మనిషి దానధర్మాలు చేసేలా ప్రోత్సహించడం కూడా ఈ మాసపు లక్ష్యమని పేర్కొంటున్నారు.

ఆధ్యాత్మికత నిండుగా..

ఇస్లాం మత పంచ సూత్రాలైన ఇమాన్ (దేవుడు ఒక్కడే), నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపావాస దీక్షలు), జకాత్ (దానం), హజ్ (మక్కాయాత్ర)లను ఆచరణాత్మకంగా నిరూపించుకునే అవకాశం ముస్లింలకు ఈ మాసంలో వస్తుంది. అందుకే ముస్లింలందరూ ఏటా రంజాన్ మాసం కోసం ఎదురు చూస్తుంటారు. ఈ నెలలో పగలు తాగునీరు కూడా ముట్టకుండా ఉపవాసం పాటిస్తారు. అసత్యం మాట్లాడకపోవడం, తప్పులు చేయకపోవడంతోపాటు నమాజ్, దైవ చింతన, ఖురాన్ గ్రంథ పఠనంతో గడుపుతారు. తమ ఆస్తుల నుంచి ఖురాన్‌లో పేర్కొన్న నిష్పత్తి ప్రకారం పేదల వాటా తీసి దానం చేస్తారు. నెలరోజులపాటు ఉపవాసం చేశాక షవ్వాల్ మాసం మొదటి రోజు ఈదుల్ ఫితర్'(రంజాన్) పండుగను జరుపుకుంటారు. ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు.

ఆకలి బాధ తెలుస్తుంది



రంజాన్ నెలలో ఆచరించే ఉపవాసం అంటే పగలంతా పస్తు లుండటమే కాదు. కనీసం ఒక్కపూట కూడా తిండికి నోచుకోని వారి ఆకలి బాధ, ఒళ్లు దాచుకోవడానికి కూడా దుస్తులు లేని దుర్భర జీవనం సాగించే వారి దుస్థితిని అవగతం చేసుకోవడం ఉపవాసం ఉద్దేశం. – ఎండీ ఉస్మాన్‌ఖాన్, ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత, ములకలపల్లి

నిష్టతో ఆచరిస్తాం



చిరుప్రాయం నుంచి ప్రతిఏటా నిష్టతో ఉపవాస దీక్ష ఆచరిస్తున్నాను. రంజాన్ మాసంతో పాటు మిగతా రోజుల్లోనూ ఐదుసార్లు నమాజ్ చేస్తాను. శరీరాన్ని రోజాతో శుష్కింపచేస్తే సహనం అలవడుతుంది. ఉపవాస దీక్ష ఆచరిస్తే పుణ్య ఫలం సిద్ధిస్తుంది.
– ఎండీ జమాలుద్దీన్, ఇల్లెందు

ఆరోగ్య పరిరక్షణ



ఆత్మ, శరీర ప్రక్షాళన కోసం రోజాను ఆచరిస్తాం. నిష్టగా ఖురాన్ పఠిస్తాం. రంజాన్ మాసంలో రోజువారీ ప్రార్థనలు మనిషి ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతాయి. ధానధర్మాలు చేయడంతో సామాజిక సేవ అలవడుతుంది.
– ఎండీ ఇరాహిత్, ప్రభుత్వ ఖాజీ, ఇల్లెందు

సానుభూతి నెల



ఉపవాసవ్రతం పాటిస్తే ఆకలి అంటే ఏమిటో స్వయంగా అనుభవంలోకి వస్తుంది. తద్వార మనిషిలో పరుల పట్ల సానుభూతిభావాలు పెంపొందుతాయి. పేదలకు దానధర్మాలు చేయాలన్న సద్భావన జనిస్తుంది. – యాకుబ్‌పాషా, జిల్లా మైనారిటీ ప్రెసిడెంట్, పాల్వంచ

కుప్పకూలిన వలస బతుకులు

అట్టల ఫ్యాక్టరీ బావిలో వెలువడిన విషవాయువు

- ఇద్దరు అన్నదమ్ముల మృతితో తీవ్ర విషాదం
- పెళ్లి అయినా ఏడాదికే భర్తను కోల్పోయిన యువతి

బూర్గంపాడు: బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మిక కుటుంబాలకు తీరని శోకం మిగిలింది. ఒకే ఘటనలో అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోవడంతో మిగతా వారు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. పెళ్లి అయి ఏడాది గడవక ముందే భర్తను కోల్పోయిన ఆ అమాయక గిరిజన యువతిని కదిలిస్తే కన్నీటి పర్యంతమవుతోంది. తన కళ్ల ముందే భర్త ఊపిరాడక తనువు చాలించడంతో మనోవేదనకు గురవుతోంది. బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న అమాయక గిరిజనులను చూసి పలువురి హృదయం ద్రవించింది.

ఆస్పత్రికి తరలించేలోపే..



కవ్వాసి బుద్ధారామ్, జోగా మృతదేహాలు

బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురంలోని ఎస్‌ఎస్ పల్ప్ అండ్ ఎగ్‌ట్రే కంపెనీలో బుధవారం రాత్రి జరిగిన ఘటనలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా గుడెసె గ్రామానికి చెందిన కవ్వాసి బుద్ధారామ్ (23), అతని సోదరుడు కవ్వాసి జోగా(21) మృతి చెందారు. విధి నిర్వహణలో భాగంగా కంపెనీ పల్ప్ బావిలోకి దిగిన వీరు ఇరువురు ఊపిరాడక కుప్పకూలారు. వీరిని బయటకు తీసే క్రమంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన గొగ్గలి రాంబాబు కూడా అపస్మారక స్థితికి చేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బావిలో పడిపోయిన బుద్ధారామ్, జోగాలను బయటకు ఆస్పత్రికి తరలించేటప్పటికే వారు మృతిచెందారు. ఈ ఘటనతో తోటి కార్మికుల్లో తీవ్రవిషాదం నెలకొంది.


ఆస్పత్రి వద్ద తీవ్ర వేదనలో బుద్ధారామ్ భార్య, చెల్లెలు

అన్నదమ్ముల మృతితో తీవ్ర విషాదం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బుద్ధారామ్, జోగా సొంత అన్నదమ్ములు. వీరి తండ్రి గంగారామ్ పదేళ్ల క్రితమే మృతి చెందగా, తల్లి కోసి పెంచి పెద్దచేసింది. మూడేళ్ల నుంచి లక్ష్మీపురం పరిసరాల్లోని అట్టల ఫ్యాక్టరీలలో పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పొడియం హిమాని అనే యువతి కూడా వీరితో పాటు పనులకు వచ్చింది. ఈ క్రమంలోనే ఏడాది క్రితం హిమానిని బుద్ధారామ్ పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి అయి ఏడాది కాకుండానే భర్త కళ్ల ముందే మృతిచెందటంతో ఆ యువతి తీవ్ర వేదనలో మునిగిపోయింది. బాధితులకు తెలుగు రాకపోవటంతో వారి బాధను ఎవరికి చెప్పుకోలేకపోయారు. బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో ఉన్న మృతదేహాల వద్ద బుద్ధారామ్ భార్య హిమాని, సోదరి జమిలి(బాబాయి కూతురు), మరో బంధువు కుమార్ ముగ్గురు మాత్రమే రాత్రంతా జాగారం చేశారు. గురువారం ఉదయం బుద్ధారామ్ భార్య హిమాని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంతోష్ కేసు నమోదు చేసి పంచనామా చేయించారు. అనంతరం మృతదేహాలను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తమ స్వగ్రామానికి తరలించారు.

రక్షణ చర్యలు చేపట్టకపోవడంవల్లే..

అట్టల ఫ్యాక్టరీలో తగిన రక్షణ చర్యలు చేపట్టకపోవటంతోనే తన భర్త, మరిది పల్ప్ బావిలోకి దిగి ఊపిరాడక ప్రాణాలు పొగొట్టుకున్నారని మృతుని భార్య హిమాని తన ఫిర్యాదులో పేర్కొంది. బావిలోకి దిగేటప్పుడు ఫ్యాక్టరీ యాజమాన్యం తమవారికి కనీస అవగాహన కూడా కల్పించకపోవటంతో వారు ఎలాంటి జాగ్రత్తలు లేకుండా బావిలోకి దిగారని ఫిర్యాదులో తెలిపింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

కక్ష సాధింపు మానకుంటే ఆత్మహత్యే శరణ్యం

- మహిళా కౌన్సిలర్ భర్త, సింగరేణి కార్మికుడు రంజిత్‌కుమార్
- రాజకీయ కుట్రతోనే బదిలీ చేస్తున్నారని ఆవేదన


రంజిత్‌కుమార్

ఇల్లెందు: రాజకీయ కక్ష సాధింపు చర్యలతోనే తనను బదిలీ చేయడంతో పాటు ఆర్థికంగా తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారని, ఇలాంటి చర్యలు మానకుంటే తమ కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని ఓ సింగరేణి కార్మికుడు ఆవేదన చెందుతున్న ఘటన ఇల్లెందులో గురువారం సంచలనం రేకెత్తించింది. ఇల్లెందు మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ పత్తి స్వప్న భర్త రంజిత్‌కుమార్ స్థానిక సింగరేణి జేకే ఓసీలో ఓల్వో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లుపై కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించగా.. అందులో స్వప్న కూడా ఉన్నారు. దీంతోపాటు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఆ సమయంలోనే రంజిత్‌కుమార్‌కు ఇల్లెందు నుంచి మణుగూరుకు బదిలీ కాగా, రాజకీయ కుట్రతోనే ఇలా చేశారంటూ బదిలీ ఉత్తర్వులు తీసుకోలేదు. బదిలీ అయినందున స్థానిక సింగరేణి అధికారులు సైతం విధులకు రానివ్వడం లేదు.

బదిలీ ఆపుతామంటూ హామీ..

మున్సిపల్ చైర్మన్ డీవీపై అవిశ్వాసం ప్రకటించిన నేతలంతా క్యాంప్‌నకు వెళ్లగా.. వారిని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి వరంగల్‌లోని తన ఇంటికి పిలిపించి మాట్లాడారు. అప్పుడు స్వప్న తన భర్త బదిలీ విషయం ప్రస్తావించగా ఎమ్మెల్సీతో పాటు ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, మార్కెట్ చైర్మన్ హరిసింగ్‌నాయక్ తదితర నేతలు బదిలీ ఆగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ అది అమలు కాలేదు. బదిలీ ఇక్కడ జరిగింది కాదని, పైస్థాయిలో వ్యవహారమని సింగరేణి అధికారులు చెప్పారు. తన భార్య ఇండిపెండెంట్‌గా గెలిచి, ఎమ్మెల్యే పిలుపు మేరకు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిందని, కౌన్సిలర్‌గా ఉన్న తమ కుటుంబా నికే న్యాయం జరగకుంటే సాధారణ ప్రజలకు ఏం చేస్తారని రంజిత్ ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వేతనం రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయాడు. తాము దళితులమైనందున వివక్ష చూపుతున్నారని ఆరోపించాడు. తన బదిలీ ఆపి, న్యాయం చేయకుంటే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటామంటూ సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. బదిలీ విషయమై సింగరేణి పర్సనల్ డీజీఎం జి.వి. మోహన్‌రావును వివరణ కోరగా.. బదిలీలు తమ వద్ద కావని, కార్పొరేట్ స్థాయిలోనే బదిలీలు జరుగుతాయని చెప్పారు. రెండు నెలల క్రితమే రంజిత్‌కుమార్‌కు బదిలీ అయినప్పటికీ ఆయన ఉత్తర్వులు తీసుకోలేదన్నారు. సింగరేణి సంస్థకు – రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

లౌకిక శక్తులు ఏకం కావాలి


మాట్లాడుతున్న కూనంనేని

ఇల్లెందు/ఇల్లెందురూరల్: దేశ రక్షణకు వామపక్ష, ప్రగతిశీల, లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మండలంలోని 21పిట్ ఏరియా బొల్లినగర్‌లో సీపీఐ, ఏఐటీయూసీ నాయకుడు అఫ్జల్ స్మారక స్థూపాన్ని గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ పాలన బ్రిటీష్ తెల్లదొరల, రజాకార్ల పాలనను తలపిస్తోందని విమర్శించారు. మోదీ తీరుతో దేశ సమైక్యత, సమగ్రతలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, నాయకులు మిర్యాల రంగయ్య, సారయ్య, ఏపూరి బ్రహ్మం, దేవరకొండ శంకర్, గుగులోత్ కృష్ణ, బందం నాగయ్య, ఉడత ఐలయ్య, వడ్ల శ్రీనివాస్, శంషుద్దీన్, రాఘవేంద్రరావు, కుమ్మరి రవీందర్, ఎస్వీ రమణ, దాసరి రాజారాం, రాజేశ్వరరావు, నజీర్, హరీష్, బాషిపాక రవి, సదానందం, బొల్లి కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న కారు

- ప్రమాదంలో ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మైలవరం వద్ద ప్రమాదం


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



చైతన్య, జాన్ ప్రణీత్ (ఫైల్)

పాల్వంచ: ఆగిన ఉన్న డీసీఎం వ్యాన్‌ను కారు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైలవరం మండలంలోని పుల్లూరు సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పాల్వంచలోని రాహుల్ గాంధీనగర్‌కు చెందిన పాక చైతన్య(32), కొత్తగూడేనికి చెందిన ఆవులపాటి సాయిరామ్, బండారు సాయి వికాస్, కొత్తగూడెంలోని రామవరానికి చెందిన జాన్ ప్రణీత్(25) నలుగురు స్నేహితులు. వీరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. నలుగురూ కలిసి కారులో ఏపీలోని బాపట్ల బీచ్‌కు వెళ్లారు. అక్కడ సరదాగా గడిపి తిరిగి ఇంటికి బయలుదేరారు. గురువారం తెల్లవారు జామున 3.15 గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న కారు మైలవరం మండలం పుల్లూరు సెంటర్‌లోని బస్ షెల్టర్ వద్ద రోడ్డుపై నిలిపిన వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చైతన్య(32) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన పాగోలు జాన్ ప్రణీత్, సాయిరామ్, సాయి వికాస్‌లను చికిత్స నిమిత్తం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జాన్‌ప్రణీత్ మృతి చెందాడు. మిగితా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. కాగా ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని మైలవరం ఎస్‌ఐ పి.రాంబాబు తెలిపారు. చైతన్య అవివాహితుడు కాగా తండ్రి మణుగూరులోని బీటీపీఎస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మృతదేహాన్ని పాల్వంచలోని నివాసానికి తీసుకొచ్చారు. యువకుడి మృతితో విషాదఛాయలు అలముకున్నాయి.

ప్రాణం తీసిన చెట్టు

కూలిన చెట్టును తొలగించడకపోవడంతో ప్రమాదం


రహదారిపై కూలిన చెట్టుకు ఢీకొన్న రాజు ద్విచక్రవాహనం

పాల్వంచరూరల్: ఇటీవల గాలివానకు రోడ్డుపై కూలిన చెట్టును తొలగించకపోవడంతో దాన్ని ప్రమాదవశాత్తు ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. పాల్వంచ మండలం రేగులగూడేనికి చెందిన రైతు మక్కటి రాజు(40) గురువారం చంద్రాలగూడెంలో బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో చంద్రాలగూడెం – మామిడిగూడెం గ్రామాల మధ్య రహదారిపై కూలి పడి ఉన్న చెట్టును ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను 108 ద్వారా రేగళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజుకు భార్య సుగుణ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


రాజు మృతదేహం

భద్రాద్రి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు

బీఆర్‌ఎస్ నేత తెల్లం వెంకట్రావ్


మాట్లాడుతున్న తెల్లం వెంకట్రావ్

భద్రాచలం: భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు, వేల కోట్లు ఇస్తామంటూ ఇక్కడి ప్రజలను మోసం చేసిన కేసీఆర్ మళ్లీ భద్రాచలం వచ్చినా ఇచ్చేది 'గుండు సున్నా'నే అని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. పట్టణంలోని ఆదివాసీ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రాచలం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. రాష్ట్రాల విభజనతో ప్రారంభమైన భద్రాచల అభివృద్ధి పతనం, ఆ తర్వాత జిల్లాల విభజన, తాజాగా పంచాయతీల విభజనతో పతాక స్థాయికి చేరిందని విమర్శించారు. గిరిజనులకు పోడు హక్కుల పత్రాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తన రాజకీయ ప్రస్థానానికి నాంది పలికిన పొంగులేటి శ్రీనివాసరెడ్డితోనే భవిష్యత్ ప్రస్థానం సాగుతుందని తేల్చి చెప్పారు. కుట్ర పూరితంగానే తనకున్న భద్రతను ప్రభుత్వం తొలగించిందన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, రమాకాంత్, రజనీకాంత్, బంబోతుల రాజీవ్, నవాబ్, ఘంటా కృష్ణ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- బార్‌షాపు వర్కర్ తలపగులగొట్టిన వైనం
- ఆటో ఢీకొట్టడంతో మరో వ్యక్తికి గాయాలు
- ప్రభుత్వాస్పత్రిలోనూ సిబ్బందితో ఘర్షణ


ఆస్పత్రి సామగ్రి ధ్వంసం చేసిన దృశ్యం

పాల్వంచ: మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. షాపులో పనిచేసే వ్యక్తి తలపగులగొట్టి ఆటోలో పారిపోతూ మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రిసెప్షన్ కౌంటర్‌వద్ద వైద్య సిబ్బందిపై ఘర్షణకు దిగి నానా హంగామా సృష్టించారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడేనికి చెందిన యువకులు మాణిక్యం లోకేశ్, పటేల్ పూర్ణచందర్‌రావు, పల్లం సాయికుమార్ ఆటోలో నవభారత్ సెంటర్ వద్ద గల ఓ వైన్ షాపులో మద్యం తాగేందుకు వచ్చారు. తాగి బిల్లు కట్టే క్రమంలో వైన్‌షాపు వర్కర్ కె.వేణుతో గొడవ పడ్డారు. చెక్కముక్కతో కొట్టడంతో వేణు తలపగిలింది. అనంతరం అక్కడి నుంచి ఆటోలో పరారయ్యారు. కొత్తగూడెం వైపు ఆటోలో వెళుతూ మోటార్‌సైకిల్‌పై వెళుతున్న భిక్షం అనే వ్యక్తిని ఢీ కొట్టారు. అతనికి గాయాలయ్యాయి. అతనిపైనే తిరిగి గొడవకు దిగడంతో స్థానికులు కొందరు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారొచ్చి యువకులతో పాటు గాయపడ్డ వేణు, భిక్షంలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకులు ఆస్పత్రి వద్ద కూడా వైద్య సిబ్బంది, వైద్యురాలు మౌనికతో గొడవ పడ్డారు. రిసెప్షన్ కౌంటర్ వద్ద ఉన్న అద్దాలు, ఆక్సిజన్ బోర్డ్‌ను పగులగొట్టారు. దీంతో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని మూడు కేసులు నమోదు చేసినట్లు పట్టణ అదనపు ఎస్‌ఐ జి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా గాయపడ్డ వేణు, భిక్షంలకు చికిత్స అందించారు.

'నర్మద' సినిమా టీజర్ విడుదల

కొత్తగూడెంరూరల్: జిల్లా కళాకారులతో నిర్మించిన నర్మద సినిమా టీజర్‌ను సింగరేణి రిటైర్డ్ జీఎం అందెల ఆనందరావు గురువారం కొత్తగూడెంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తున్న దర్శకుడు సుభాకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మద్దెల శివకుమార్, కలవల చంద్రశేఖర్, తాండూర్ ధనరాజ్, కనకరాజ్, ప్రభు, అల్లిశంకర్, మంద హనుమంత్, కొప్పరి నవతన్, సురేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఒకరిద్దరి తప్పిదాన్ని వ్యవస్థకు ఆపాదించొద్దు

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల అంశంలో మంత్రి కేటీఆర్‌పై విపక్షాలు బురద చల్లడం సరికాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం శాసనమండలిలో తన చాంబర్‌లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. పేపర్ లీకేజీ ఘటనలో ఒకరిద్దరి తప్పిదాన్ని మొత్తం వ్యవస్థకు ఆపాదించడం సరికాదన్నారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ఉద్దేశమని, ఎనిమిదేళ్లుగా ఎలాంటి తప్పులకు తావులేకుండా సంస్థ పనిచేస్తోందన్నారు. సీబీఐ విచారణ చేయాలని తప్పుడు వాదన చేస్తూ పోలీసు వ్యవస్థను తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు. 'సిట్'విచారణలో బాధ్యులకు శిక్ష పడుతుందని సుఖేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పాసైన పది బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ పెండింగ్‌లో పెట్టడంతో పాలనకు ఆటంకం కలుగుతోందని విచారం వ్యక్తం చేశారు. బిల్లులకు సవరణలు ఏవైనా ఉంటే ప్రభుత్వానికి సూచించి ప్రజల అవసరాలు తీర్చేవిధంగా, చట్టసభల గౌరవాన్ని కాపాడేవిధంగా గవర్నర్ వ్యవహరించాలని సూచించారు. దర్యాప్తు సంస్థలతో రాష్ట్రాల నాయకత్వాన్ని కేంద్రం వేధిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అధిపత్యం కోసమే రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారన్నారు.

16.8 కోట్ల మంది డేటా చోరీ!

▶ మొదటి పేజీ తరువాయి

డేటా చోరీకి పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును సైబర్‌క్రైం పోలీసులు రట్టు చేశారు. దేశవ్యాప్తంగా 16.80 కోట్ల మందికి చెందిన వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని దొంగిలించి విక్రయిస్తున్న కేటుగాళ్ల ఆటకట్టించారు. ఢిల్లీ శివార్లలోని నోయిడా కేంద్రంగా ఈ దందా సాగిస్తున్న ముఠాలోని ఏడుగురు సభ్యులను అరెస్టు చేశారు. గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఈ కేసు వివరాలను వెల్లడించారు. రక్షణ శాఖలోని వివిధ హోదాల్లో పనిచేసే అధికారులు, నీట్ విద్యార్థులు, డీమ్యాట్ ఖాతాదారులు, ఐటీ సంస్థల ఉద్యోగులు, వాట్సాప్, ఫేస్‌బుక్ వినియోగదారులు, టెలికం, ఫార్మా కంపెనీలు, సీబీఎస్‌ఈ 12వ తరగతి విద్యార్థుల డేటా సహా మొత్తం 140 కేటగిరీలకు చెందిన సమాచారాన్ని నిందితులు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. రక్షణ శాఖకు చెందిన (డిఫెన్స్ ఫోర్స్ ఢిల్లీ ఎన్‌సీఆర్ డేటాబేస్)కు చెందిన 2.55 లక్షల మంది డేటా సైతం చోరీకి గురికావడంతో దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డేటా చోరీలో జస్ట్ డయల్ అనే సెర్చ్ ఇంజన్ పాత్ర ఉందని, ఈ కేసులో ఆ సంస్థ వారినీ విచారిస్తామని ఆయన పేర్కొన్నారు.

నిందితులు వీరే...

యూపీ పరిధిలోకి వచ్చే నోయిడాలో డేటా మార్ట్ ఇన్ఫోటెక్, గోబల్ డేటా ఆర్ట్స్, ఎంఎస్ డిజిటల్ గ్రో అనే కంపెనీల (కాల్‌సెంటర్లు) ద్వారా నిందితులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రధాన నిందితుడు ఏ1 కుమార్ నితీష్ భూషణ్‌తోపాటు టెలికాలర్ కుమారి పూజ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుశీల్ తోమర్, క్రెడిట్ కార్డుల డేటా విక్రయించే అతుల్ సింగ్, ఎంఎస్ గ్రో కంపెనీలో సేకరించిన డేటాను విక్రయించే ముస్కాన్ హసన్, గ్లోబల్ డేటాఆర్ట్స్‌లో జస్ట్ డయల్ ద్వారా డేటాను విక్రయించే సందీప్ పాల్, బల్క్ మెసేజ్‌లు పంపే జియా ఉర్ రెహమాన్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 12 సెల్‌ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 సీపీయూలు, 140 కేటగిరీలలో డేటా చోరీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కార్యాలయాల్లో ప్రజల పాన్, మొబైల్, టెలికం, ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ శాఖ, పెట్రోలియం కంపెనీలు, బ్యాంకుల డేటా, వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్ల డేటాను పోలీసులు కనుగొన్నారు. నిందితులు ఇప్పటివరకు సుమారు 100 మంది సైబర్ క్రిమినల్స్‌కు డేటాను విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. అలాగే 50 వేల మంది పౌరులకు చెందిన సమాచారాన్ని కేవలం రూ. 2 వేలకు విక్రయించినట్లు గుర్తించామన్నారు. డేటా చోరీపై సైబర్‌క్రైం పోలీసులకు అందిన పలు ఫిర్యాదుల ఆధారంగానే దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నామన్నారు.

భారీగా డేటా చోరీ...

నిందితులు చోరీ చేసిన డేటాలో 1.47 కోట్ల కార్ల యజమానుల, డొమైన్ వాయిస్ డేటాబేస్ 3.47 కోట్లు, మొబైల్ నంబర్ల డేటాబేస్ 3 కోట్లు, స్టూడెంట్ డేటాబేస్ 2 కోట్లు, వాట్సాప్ యూజర్లు 1.2 కోట్ల మంది డేటా చోరీ గురైంది. అలాగే జాబ్ సీకర్స్ డేటాబేస్ 40 లక్షలు, సీబీఎస్‌ఈ 12వ తరగతికి చెందిన 12 లక్షల మంది విద్యార్థులు, సివిల్ ఇంజనీర్ల వివరాలు 2.3 లక్షలు, డెబిట్ కార్డుల సమాచారం 8.1 లక్షలు, సీనియర్ సిటిజన్స్ 10.6 లక్షలు, వెబ్‌సైట్ ఓనర్స్ 17.4 లక్షలు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ డేటా చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు.

గుర్తించిన అంశాలు...

- పలు ఆర్థిక సంస్థలు, సోషల్ మీడియా, జస్ట్ డయల్ వంటి సంస్థలు ప్రజల అనుమతి లేకుండానే డేటాను సేకరిస్తున్నాయి.
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో సేవలందించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు, వ్యక్తుల ద్వారా డేటా చోరీకి గురవుతున్నట్లు పోలీసులు గుర్తించారు.
- గోప్యంగా ఉంచాల్సిన డేటా భద్రంగా ఉందోలేదో సర్వీసు ప్రొవైడర్లు తనిఖీ చేయట్లేదని తేలింది.
- జస్ట్ డయల్ లాంటి సంస్థల్లో డేటా విక్రయానికి అందుబాటులో ఉంది.

పోలీసుల సూచనలు...

- మీ డేటాను ప్రైవేటు కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిస్తే మాకు ఫిర్యాదు చేయండి.
- క్రెడిట్ కార్డులు, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు, సంస్థలకు చెప్పొద్దు.
- మొబైల్, కంప్యూటర్, యాప్‌లు ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

కేసు దర్యాప్తు సిట్‌కు బదిలీ


దేశ భద్రతకు సంబంధించిన సమాచారం ముడిపడి ఉన్నందున డేటా చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్లు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఇందుకోసం డీసీపీ (క్రైమ్స్) కల్మేశ్వర్ నేతృత్వంలో 'సిట్'ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ టీమ్‌లో సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ రితిరాజ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఇతర అధికారులు ఉంటారని తెలిపారు.

క్రెడిట్ కార్డుదారుల డేటా చోరీ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: బ్యాంకుల్లో డేటా చోరీ చేసే ముఠాను సైబర్‌క్రైం పోలీసులు అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. క్రెడిట్ కార్డుల వెరిఫికేషన్ చేస్తున్న థర్డ్ పార్టీకి చెందిన సిబ్బంది డేటాను చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన 1,780 మంది కస్టమర్ల డేటాతోపాటు ఎస్‌బీఐకి చెందిన 140 మంది కస్టమర్ల డేటా చోరీకి గురైందన్నారు. ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న ఈ దందాలో ప్రధాన నిందితుడు కఫీన్ అహ్మద్, మహ్మద్ సమాల్, మహ్మద్ ఆసీఫ్, చిరాగ్, విరేంద్ర సింగ్, ప్రదీప్ వాలియా, ఆకాశ్‌నిర్వాన్, విరాట్ పురి, అతీత్ దాస్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 13 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, క్రెడిట్ కార్డుల డేటా స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ అనుబంధం నిరంతరం



● 2017 ఆగస్టులో ఆదిలాబాద్ జెడ్పీ సమావేశం జరుగుతోంది. అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మంచిర్యాలలో భూకబ్జాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ పహాణీలో నమోదై ఉందని అన్నారు. ఇది గమనించిన 'సాక్షి' ప్రతినిధి అలాంటి రెవెన్యూ బాగోతాలపై పరిశోధన చేశారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తండ్రి లక్ష్మణరావు పేరిట 57.04 ఎకరాల ప్రభుత్వ భూమి నమోదై ఉన్నట్టు ఆధారాలు లభించాయి. ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసిన తర్వాత 'నడిపెల్లి లక్ష్మణరావు @ 57.04 ఎకరాలు' శీర్షికన 2017 ఆగస్టు 21న 'సాక్షి' వార్తా కథనం ప్రచురించింది.

✔ రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ వార్తతో అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో కదలిక వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు వెంటనే స్పందించి ఆ భూమికి తనకు ఎలాంటి సంబంధం లేదని, వెంటనే స్వాధీనం చేసుకోవాలని హైదరాబాద్‌లో సీసీఎల్‌ఏను కలిసి విన్నవించారు కూడా. అదొక 'సాంకేతిక సమస్య' అని అప్పటి ఆర్డీఓ మీడియాతో చెప్పారు. దీనిపై పరిశోధన సాగించిన 'సాక్షి' రిజిస్ట్రేషన్‌లో లింక్ చేసిన ఆధార్ వివరాలు సేకరించి.. అదే నెల 27న మరో కథనాన్ని ప్రచురించింది. నడిపెల్లి లక్ష్మణరావు 2003లోనే చనిపోగా.. అలాంటి పేరు గల నడిపెల్లి లక్ష్మీకాంతరావు ఆధార్‌ను పెట్టి, 2010 సంవత్సరం తర్వాత ఈ భూమిని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించిన విషయాన్ని ఆధారాలతో సహా ప్రచురించింది.

- సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

మసివాగుపై తాత్కాలిక వంతెన



● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.. ఇల్లెందు మండలంలోని మిట్టపల్లి గ్రామం పరిధిలో మసివాగు ఉంటుంది. చిన్నవాన పడ్డా వాగు ఉప్పొంగి మిట్టపల్లి మీదుగా ఇల్లెందు, బయ్యారం మండలాల్లోని పదిహేను గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. గిరిజనులు వాగుపై చెట్ల తీగలు, కొమ్మలు, చెక్కలతో వంతెనలా ఏర్పాటు చేసుకున్నా.. అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు వీలయ్యేదికాదు. ఈ కష్టాలను వివరిస్తూ.. 2010 సెప్టెంబర్ 8న 'చెట్లపై నిచ్చెన మెట్లు.. ఎన్నాళ్లీ ఇక్కట్లు' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. ఆ మరునాడే మిట్టపల్లికి చెందిన బానోత్ జమ్కూ(50) అనే మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వాగు దాటలేక, చికిత్స అందక మృతి చెందింది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అదే నెల 12న 'మసివాగు వంతెన.. శ్రమదానంతోనైనా నిర్మిస్తాం' అని గిరిజనుల వాయిస్‌తో మరో కథనం ప్రచురితమైంది.

✔ 'సాక్షి' కథనాలతో అప్పటి ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్పీ క్రాంతి రాణా మిట్టపల్లి వెళ్లి గిరిజనుల ఇక్కట్లను పరిశీలించారు. స్థానిక డీఎస్పీ, యాదగిరిరెడ్డి అనే వ్యాపారి సహకారంతో మసివాగుపై తాత్కాలికంగా ఇనుప వంతెన నిర్మించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 2011 మేలో శాశ్వత వంతెన పనులు మొదలుపెట్టింది. 2013 మార్చి 24న ప్రారంభించింది. ఇప్పుడు పల్లె వెలుగు బస్సులు పరుగులు తీస్తుండడంతో పదిహేను గ్రామాల ప్రజల ఇక్కట్లు తీరిపోయాయి.

- ఇల్లెందు

దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పశు పోషకులకు తక్కువ ధరలకే నాణ్యమైన పశువుల జనరిక్ మందులను అందించే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ పశు ఔషధ నేస్తం పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నామని ఏపీ పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 52 పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడలోని పశు సంవర్థక శాఖ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రాన్ని గురువారం మంత్రి అప్పలరాజు ప్రారంభించారు.

ఎల్బీనగర్ లాడ్జిలో ఎవరెవరు కలిశారు?

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలోని తమ ఇంటికి తీసుకువెళ్లారు. రెండు రోజుల పాటు అక్కడే ఉంచి పరీక్షలకు సిద్ధం చేశారు. ఈ నెల 4 రాత్రి నీలేష్, గోపాల్, డాక్యాలతో పాటు అతడి సమీప బంధువు రాజేందర్ రెండు వాహనాలపై ఎల్బీనగర్‌కు వచ్చారు. అక్కడి ఓ లాడ్జిలో బస చేశారు. మర్నాడు సరూర్‌నగర్‌లోని పరీక్ష కేంద్రంలో నీలేష్, గోపాల్‌తో పరీక్ష రాయించారు. అయితే వీళ్లు లాడ్జిలో ఉండగా కొందరు వచ్చి కలిసినట్లు సిట్ అధికారులకు ఆధారాలు లభించాయి. దీంతో వాళ్లు అభ్యర్థులేనా? కొన్ని ప్రశ్నలు లేదా ప్రశ్నపత్రాన్ని నీలేష్, గోపాల్ వారితో పంచుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సాంకేతిక ఆధారాలతో పాటు సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్ ఆధారంగా ముందుకు వెళ్తున్నారు. 9 మంది నిందితుల్ని మరో నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

జైలుకు మరో ముగ్గురు నిందితులు...

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష లీకేజ్ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీలో పని చేస్తున్న, చేసిన వారి పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. 2013లో గ్రూప్–2 ద్వారా ఎంపికై, ప్రస్తుతం కమిషన్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న షమీమ్ అనే మహిళకు రాజశేఖర్ ద్వారా గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష పత్రం అందింది. దీని ఆధారంగా పరీక్ష రాసిన ఆమె ఏకంగా 127 మార్కులు పొందింది. కమిషన్‌కు చెందిన ఓ సభ్యుడి వద్ద పీఏగా పని చేస్తున్న డి.రమేష్ కుమార్‌తో పాటు మాజీ ఉద్యోగి సురేష్‌కు ప్రవీణ్ ద్వారా ఈ క్వశ్చన్ పేపర్ చేరింది. వీరిలో రమేష్‌కు 122 మార్కులు, సురేష్‌కు 107 మార్కులు వచ్చినట్లు సిట్ గుర్తించింది. ఈ ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వీరిని వారం రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ శుక్రవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

25 మంది అభ్యర్థులకు నోటీసులు..

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షల్లో 100కు పైగా మార్కులు సాధించిన 25 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. నిర్ణీత తేదీల్లో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. విడతల వారీగా మొత్తం 121 మందికి నోటీసులు ఇవ్వనున్నారు. టీఎస్‌పీఎస్సీ కస్టోడియన్ శంకరలక్ష్మిని మరోసారి విచారించాలని నిర్ణయించారు.

తెరపైకి రాజశేఖర్ బంధువు

ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో రెండో నిందితుడిగా ఉన్న రాజశేఖర్ సమీప బంధువు ప్రశాంత్ పేరు తాజాగా వెలుగులోకి వచ్చింది. కొన్నేళ్లుగా న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ప్రశాంత్ గ్రూప్–1 పరీక్షకు దరఖాస్తు చేసుకున్నాడు. గతేడాది అక్టోబర్‌లో నగరానికి వచ్చి ప్రిలిమినరీ పరీక్ష రాసి వెళ్ళాడు. ఈ పరీక్షలో క్వాలిఫై అయిన ప్రశాంత్ 100కు పైగా మార్కులు పొందినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఇతడికి లీకైన గ్రూప్–1 పేపర్ అందిందా? అని అనుమానిస్తున్న సిట్ అధికారులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వార్తలు

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా తెల్ల వారుజామున శ్రీవారికి అర్చకులు సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ ధ్వజారోహణం చేయగా.. గోపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, పల్లకీ సేవ భక్తుల సమక్షాన ఘనంగా జరిగాయి. కాగా, మయూర వాహనంపై శ్రీవారు, అమ్మవార్లను కూర్చుండబెట్టి గిరి ప్రదక్షణ నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి, ఉప ప్రధాన అర్చకులు విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను సందర్శించిన వియత్నాం దేశస్తులు



మక్కలను పరిశీలిస్తున్న విదేశీ వ్యాపారులు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని వ్యవసాయ మార్కెట్‌ను గురువారం వియత్నాం దేశానికి చెందిన ఓ కంపెనీ వ్యాపారులు సందర్శించారు. కంపెనీ యజమాని రోనాన్, మరికొందరు వ్యాపారులు మక్కలు కొనుగోలు చేసేందుకు ఇక్కడికి వచ్చారు. ఈమేరకు మార్కెట్‌కు చెందిన వ్యాపారి బిజ్జాల వెంకటేశ్వర్లుతో కలిసి యార్డుల్లో తిరుగుతూ మక్కల నాణ్యతను పరిశీలించారు.

ప్రశాంతంగా పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈమేరకు గురువారం ప్రథమ సంవత్సరం పరీక్ష జరగగా, మొత్తం 16,702మంది విద్యార్థుల్లో 15,975మంది హాజరుకాగా, 727 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. జనరల్ విభాగంలో 14,099 మందికి 13,693మంది, ఒకేషనల్ విభాగంలో 2,603మందికి గాను 2,282మంది హాజరయ్యారని వెల్లడించారు.

రామాయణ క్రతువు ప్రారంభం

ఘనంగా ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ



ధ్వజారోహణ పూజలలో పాల్గొన్న రుత్వికులు, అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరామాయణ క్రతువును శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక వేడుకల కోసం ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలోని 12 హోమకుండాల్లో ఈ క్రతువుకు శ్రీకారం చుట్టారు. తొలుత పట్టాభిషేక యాగశాల వద్ద ఆచార్య, బ్రహ్మ, రుత్విక్‌లచే అగ్ని మథనం కార్యక్రమం చేపట్టారు. అగ్నిని పుట్టించి హోమకుండాల్లో పూజలు చేపట్టారు. అనంతరం గరుత్మంతుడి బొమ్మను వస్త్రంపై వేసి, ధ్వజారోహణం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. శ్రీరామాయణ మహా క్రతువులో భాగంగా రుత్వికులు చతుర్వేద హవనములు, రామాయణ హవనం, రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరీ మంత్రాలతో హోమం జరిపారు. అనంతరం సంక్షేప రామాయణ సామూహిక పారాయణం చేపట్టారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు.

ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ల తయారీ..

కాగా శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా భక్తుల కోసం ఆలయ అధికారులు సుమారు 180 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు. భక్తులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ముత్యాల తలంబ్రాలను విక్రయించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ముత్యాల తలంబ్రాలను మిషన్ ద్వారా ప్యాకింగ్ చేస్తున్నారు. ఓ దాత అందజేసిన ఈ మిషన్ ద్వారా రోజుకు సుమారు 30 వేల ప్యాకెట్లను తయారు చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ మిషన్‌తో ప్యాకింగ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. సుమారు 2 లక్షల ప్యాకెట్లను తొలి దశలో భక్తుల కోసం సిద్ధం చేయనున్నారు.



యాగశాలలో పూజలు చేస్తున్న అర్చకులు



అగ్నిమథనం చేస్తున్న అర్చకులు

గవర్నర్‌ను అడ్డుపెట్టి రాజకీయాలు..



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి, పక్కన ఎమ్మెల్యే శంకర్‌నాయక్, నాయకులు

కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంతో మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తోందని.. ఇది సరికాదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మహబూబాబాద్ రూరల్ మండల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీఎం కేసీఆర్ కూతురు అయినందునే లిక్కర్ స్కాంతో సంబంధం లేకున్నా బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. కాగా వారం, పది రోజుల్లో పోడు రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద నిరుపేదలు ఇంటినిర్మాణాలు చేసుకునే విధంగా ప్రభుత్వం పాటుపడుతోందని చెప్పారు. పార్టీకి కార్యకర్తలే బలగం, బలమని.. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని మంత్రి సత్యవతి చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ, ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జ్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అడ్డగోలుగా మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం సైనికుల్లా పని చేస్తూనే, ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈసమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, జెడ్పీటీసీ ప్రియాంక, నాయకులు నాయిని రంజిత్, తేళ్ల శ్రీనివాస్, సుదగాని మురళి, అశోక్, షరీఫ్, సురేందర్, వీరన్న, వెంకన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక



అలేఖ్య



శ్రీలక్ష్మి

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర మహిళల సీనియర్ ఫుట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం నిజామాబాద్‌లో కొనసాగుతుండగా, రాష్ట్ర తుది జట్టుకు జిల్లాకు చెందిన శ్రీలక్ష్మి, అలేఖ్య ఎంపికయ్యారు. ఈ జట్టు 28వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో జరగనున్న జాతీయస్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొంటుంది. కాగా, జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిలకు రూ.2వేల చొప్పున నగదును ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సెల్యూకాస్ అందజేయగా, కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్, కోచ్‌లు, క్రీడాకారులు వారిని అభినందించారు.

పంట రుణాలపై 3శాతం వడ్డీ రాయితీ

డీసీసీబీ రుణాలు ఏడాదిలోగా రెన్యువల్ చేసుకుంటే అమలు

ఖమ్మంవ్యవసాయం: పంట రుణాలను సకాలంలో చెల్లించే రైతులకు మూడు శాతం వడ్డీ రాయితీ పొందే అవకాశాన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) కల్పించింది. ఈమేరకు బ్యాంకు నుంచి తీసుకున్న పంట రుణాలకు ఏడు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, రుణం తీసుకున్న ఏడాది లోగా రెన్యూవల్ చేసుకుంటే ఏడు శాతంలో మూడు శాతం వడ్డీ రాయితీగా పొందేందుకు అవకాశం ఇచ్చింది. ఈ రాయితీని ప్రతి ఆరునెలలకోసారి క్లెయిమ్ చేసుకోవచ్చని, సెప్టెంబర్, మార్చి నెలల్లో క్లెయిమ్ చేసుకుంటే మూడు నెలల్లో విడుదలకు అవకాశం ఉందని డీసీసీబీ సీఈఓ అట్లూరి వీరబాబు తెలిపారు. డీసీసీబీకి అనుబంధంగా ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్న వంద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా 2022–23 వానాకాలంలో రూ.672 కోట్ల పంట రుణాలు ఇవ్వగా ఇప్పటి వరకు రూ.652 కోట్ల రుణాలు తిరిగి చెల్లింపు, రెన్యూవల్ అయ్యాయని పేర్కొన్నారు. ఇక యాసంగి సీజన్‌లో రూ.448 కోట్ల రుణాలు ఇవ్వగా ఇందులో రూ.358 కోట్లు తిరిగి చెల్లింపు, రెన్యూవల్స్ అయ్యాయని వెల్లడించారు. మొత్తంగా ఈ ఏడాది ఇచ్చిన రూ.1,120 కోట్ల రుణాల్లో రూ.1,010 కోట్లు తిరిగి సాధించగా, మరో రూ.110 కోట్లు రావాల్సి ఉంది. ఈ రుణాలను రైతులు మార్చి 31వ తేదీ లోగా చెల్లించడం ద్వారా మూడు శాతం వడ్డీ రాయితీ పొందాలని బ్యాంక్ సీఈఓ సూచించారు.

కొవ్వూరు రైల్వే లైన్ సంగతేమిటో తేల్చండి

లోక్‌సభలో ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రాల వారీగా కొత్తగా ప్రతిపాదించిన, మంజూరు చేసిన రైల్వే ప్రాజెక్టుల వివరాలను తెలియజేయాలని లోక్‌సభలో బీఆర్ఎస్ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు గురువారం కేంద్రప్రభుత్వాన్ని లిఖితపూర్వకంగా కోరారు. తెలంగాణలో భద్రాచలం రోడ్డు–సత్తుపల్లి రైల్వే మార్గానికి సంబంధించి ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఎన్ని నిధులు కేటాయించారో వెల్లడించాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని భద్రాచలం పుణ్యక్షేత్రం, అంతర్గత గిరిజన ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించే ఈ మార్గాన్ని కొవ్వూరు వరకు పొడిగించే అవకాశం ఉందా, లేదా అని ప్రశ్నించారు. భద్రాచలం రోడ్–కొవ్వూరు రైల్వే లైన్ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నానని, పలుమార్లు ప్రధానమంత్రి, రైల్వే మంత్రిని కలసి లేఖలు అందజేసినట్లు తెలిపారు. ఫలితంగా సత్తుపల్లి వరకు రైల్వే మార్గాన్ని పూర్తిచేసి ప్రారంభించిన కేంద్రం కొవ్వూరు వరకు పొడిగించకుండా కాలయాపన చేయడం సరికాదని పేర్కొన్నారు. దీంతో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇస్తూ రైల్వే ప్రాజెక్టులను రాష్ట్రాల వారీగా కాకుండా జోన్లవారీగా మంజూరు చేస్తూ, వివరాలను రైల్వే వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. భద్రాచలం రోడ్–కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టులో కొంత మొత్తాన్ని పంచుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. కాగా, కొత్త, ప్రతిపాదిత ప్రాజెక్టులు, నిధుల వివరాలు అడిగితే కేంద్ర మంత్రి వెల్లడించలేదని ఎంపీ నామ నాగేశ్వరరావు వెల్లడించారు.

మిర్చి ధర పతనం..

క్వింటాకు రూ.900 మేర తగ్గుదల



ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర మళ్లీ పతనమైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం తేజా రకం మిర్చి క్వింటాకు రూ.25,550 పలికిన ధర గురువారం రూ.24,650కు పడిపోయింది. మంగళవారం అమావాస్య, బుధవారం ఉగాది కావటంతో మార్కెట్‌కు రెండు రోజుల సెలవులు రాగా, మిర్చి ధర క్వింటాకు రూ.900 మేర తగ్గడం గమనార్హం. ఇక సోమవారం మోడల్ ధర రూ.23 వేలు పలకగా, గురువారం రూ.2,100 తగ్గి రూ.20,900గా నమోదైంది. అయితే, తాలు మిర్చి గరిష్ఠ ధర మాత్రం రూ.14,500గానే కొనసాగుతోంది. కాగా, గురువారం ఖమ్మం మార్కెట్‌కు 28,792 బస్తాల మిర్చి విక్రయానికి రాగా, 398 బస్తాల తాలు మిర్చిని విక్రయానికి తీసుకొచ్చారు.

పీజీ పరీక్ష కేంద్రంలో తనిఖీ



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న నరేంద్ర

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈమేరకు పరీక్ష కేంద్రాన్ని కేయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఏ.నరేంద్ర గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష కేంద్రంలోని వసతులు, ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.